# అప్పలకొండ - ఆకాశవాణి

అప్పలకొండ చాలా అమాయకుడు....

కుంచెడు నేల అప్పిగాడి స్థిరాస్థయితే -

అస్థలంలో వేసుకున్న చిన్న తాటాకు పాకా, ఆ పాకలో కుక్కి మంచం మీద రోగాలు వెళ్ళ బోసుకుంటూ, రోజులు లెక్క పెట్టుకుంటున్న తల్లీ, నాలుగయిదు రూపాయిల రోజు కూలీ, ఆ కూలి డబ్బుల్లోనే అప్పుడో రూపాయి, అప్పుడో అర్ధా మిగిల్చి కొనుక్కున్న సింగిల్ బ్యాండు రేడియో-

ఇవన్నీ వాడి చరాస్థులు....!

అప్పలకొండ ఏమీ చదువు కోలేదు...

అయినా రేడియోలో వచ్చే ప్రతి కార్యక్రమం వింటాడు.... నాటకాల్లో హీరోకానీ, హీరోయిన్ కానీ కష్టాలు పడుతుంటే అప్పిగాడు కన్నీరు పెట్టుకుంటాడు... హుషారయిన పాటలు వస్తే, వచ్చీరాని ఈలతో ఆపాటకు శృతి కలుపుతాడు...

వర్షం వస్తుందని రేడియోలో చెప్తే చటుక్కున నమ్మేసి ఆరోజంతా, తాటాకు గొడుగు వేసుకుని మరీ తిరుగుతాడు....

ఓసారి అప్పలకొండకు కడుపులో నెప్పి వచ్చింది... చాలా బాధపడ్డాడు... ఆ వూళ్ళోకనీసం ప్రాధమిక ఆరోగ్యకేంద్రం కూడా లేదు... డాక్టరు దగ్గరకు వెళ్ళాలంటే మూడుమైళ్ళు నడవాలి... తీరా అంతదూరం వెడితే అక్కడ డాక్టరు వుంటాడని గేరంటీ లేదు... ఏ కాంపౌండరో ఇన్ని ఎర్రనీళ్ళు కలిపి పోస్తాడు... సర్వరోగాలకూ అదే మందు....

అందుకే డాక్టరు గారి కోసం ఆస్పత్రికి వెళ్ళటానికి వెనుకంజ వేశాడు అప్పలకొండ... అదృష్టవశాత్తూ ఆ రోజు రాత్రి రేడియోలో 'డాక్టరుగారి సమాధానాలు' అనే కార్యక్రమం వినిపించింది అప్పలకొండకి... అందులో శ్రోతలు అడిగిన సందేహాలకు ఎవరో డాక్టరు గారు సమాధానాలు చెబుతున్నారు.....

'తమకు పిల్లలు పుట్టకుండా వుండాలంటే ఆపరేషన్ తను చేయించుకుంటే మంచిదా లేక తన పెళ్ళాం చేయించుకుంటే మంచిదా' అని ఒకరూ,' రాత్రిళ్ళు నిద్రపట్టకపోతే ఏంచేయాలీ' అని ఇంకొకరూ, 'తిన్నది అరగటంలేదు, ఏం చేయమంటారూ' అని వేరొకరూ ప్రశ్నలు పంపిస్తే - వాటన్నింటికీ - పాపం ఎంతో ఓపిగ్గా సమాధానాలు ఇస్తున్నారు డాక్టరుగారు...

ఎవరైనా కడుపునెప్పి గురించి ప్రశ్న అడుగుతారేమో - దానికి డాక్టరుగారు ఏం చెబుతారో వినాలని అతిశ్రద్ధగా, ఆ కార్యక్రమాన్నంతా విన్నాడు. కానీ, ఎవరూ కడుపు నెప్పి గురించి అడగలేదు...

'మళ్ళీ ఆదివారం రాత్రి ఇదే సమయానికి శ్రోతలు పంపే సందేహాలకు డాక్టరు జామాస్ గారు సమాధానాలు ఇస్తా'రని ఆ కార్యక్రమం చివర్లో ప్రకటించటంతో, అప్పలకొండ అంతరంగంలో ఆశలు మొలకెత్తాయి....

తన సందేహాన్ని ఏ చిరునామాకు పంపిచాలో గుర్తు పెట్టుకున్నాడు... మరచిపోకుండా, దాన్ని ఆ రాత్రి ఒకటికి పదిసార్లు అనుకున్నాడు. ఊరి మొదటి ఎలిమెంటరీ స్కూల్లో ఏకోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఏకాంబరంగారి దగ్గరకు, తెల్లవారగానే బయల్దేరాడు... ఆయనచేత 'తనకు కడుపులో నెప్పివస్తోందనీ, తగ్గాలంటే ఏం చేయమంటారో చెప్పమనీ' అడుగుతూ డాక్టరుగారి సమాధానాలు కార్యక్రమానికి ఉత్తరం రాయించాడు....

ఆదివారం వచ్చింది .....

అంతవరకూ బాగానేవున్నా తీరా ఆ సమయానికి రేడియోలో బేటరీలు అయిపోతాయేమోనని భయపడి ఆదివారం సాయంత్రానికి తన ట్రాన్సిస్టరులో కొత్త బేటరీలు వేయించాడు అప్పలకొండ...

ఆ కార్యక్రమం వినటానికి గంటముందునుంచే రేడియో దగ్గర బుద్ధిగా కూర్చున్నాడు... టైమయింది....

"ఆకాశవాణి... .. ఇప్పుడు డాక్టరుగారి సమాధానాలు శీర్షికన శ్రోతలు పంపిన ప్రశ్నలకు డాక్టర్ జామాస్ గారు సమాధానాలు ఇస్తారు" - అనే ప్రకటన వినిపించింది... రేడియో 'వాల్యూమ్' మరింత పెంచాడు అప్పలకొండ.

ఆ కార్యక్రమం మరోనాలుగు నిమిషాల్లో ముగుస్తుందనగా అప్పలకొండ పంపిన

ప్రశ్నకు డాక్టరుగారు సమాధానం చెప్పారు....

"అప్పలకొండగారు తమకు కడుపు నెప్పి వస్తోందని రాశారు... కానీ కడుపుకి ఏ భాగంలో వస్తోందో, ఏఏ సమయాల్లో వస్తోందో రాయలేదు... మనిషిని చూడకుండా వైద్యం ఏమిటో చెప్పటం అంత శ్రేయస్కరంకాదు....ఏది ఏమైనా అప్పలకొండగారు వెంటనే తమ దగ్గర్లో వున్న డాక్టర్ని చూడటం అవసరం" అదీ సమాధానం......!

అదివిన్న అప్పలకొండ, తన అమాయకత్వాన్ని తానే నిందించుకున్నాడు... నిజమే మరి... డాక్టరుగారికి అన్ని విషయాలూ వివరంగా రాయకపోతే వైద్యం ఏమిటో ఎలా చెప్పగలుగుతారు?.....

తెల్లవారగానే, ఎలిమెంటరీస్కూలు ఏకోపాధ్యాయుడు ఏకాంబరంగారి దగ్గరకు పరుగెత్తాడు అప్పలకొండ... .... కడుపు ఏ భాగంలో ఏఏ సమయంలో నెప్పి వస్తోందో మరికొంచెం వివరంగా రాయించి, ఏం చేయమంటారో చెప్పవలసిందిగా అడుగుతూ, 'డాక్టరుగారి సమాధానాలు' కార్యక్రమానికి ఉత్తరం రాయించాడు మళ్ళీ...

ఈలోగా అప్పలకొండకు కడుపునెప్పి రావటం మరింత ఎక్కువయింది.... ఒకటి రెండుసార్లు గుండెల్లో నెప్పికూడా వచ్చింది... వాంతులు కూడా అయ్యాయి...అయినా ఎలాగో ఓర్చుకుంటూ వచ్చాడు, 'ఆదివారం వస్తోంది కదా' అని.

ఆదివారం రానేవచ్చింది... ఆనాటి కార్యక్రమంలో,అప్పలకొండ పంపిన సందేహానికి డాక్టర్ యాదగిరి ఇలా సమాధానం చెప్పారు-

"అప్పలకొండగారు తమకు వుదయంపూట, కడుపులో ఎడమవైపు నెప్పి వస్తోందనీ వచ్చిన నెప్పి అరగంటసేపు వుంటోందనీ రాశారు...సంతోషం! కానీ ఆహారం ఏదైనా తీసుకున్న తరువాత ఆ నెప్పి వస్తోందో, ఆహారం తీసుకొనకముందే వస్తోందో వారు రాయలేదు.... వారి వయస్సెంతో కూడా తెలియదు... ఏది ఏమైనా కడుపునెప్పి అనేది చాలా ప్రమాదకరమైనట్టిది.... వెంటనే వారు తమకు దగ్గర్లో వున్న వైద్యనిపుణుని వద్దకు వెళ్ళి పరీక్ష చేయించుకుని, వారు చెప్పే మందులు వాడటం చాలా అవసరం"...

రేడియోలో, డాక్టరుగారు చెప్పిన సమాధానం విని అప్పలకొండ నీరు కారిపోయాడు... అన్ని వివరాలూ డాక్టరుగారికి చెప్పాలి... నిజమే..... తను అమాయకుడే కావచ్చు... మూర్ఖుడే కావచ్చు. కానీ ఎలిమెంటరీ స్కూలు ఏకోపాధ్యాయుడు ఏకాంబరంగారు చదువుకున్నవారు... పైగా పదిమందికి చదువు చెప్పేవారు... ఉత్తరం రాసేటప్పుడు వివరాలన్నీ

రాయాలని ఆయనకు తెలియకపోతే ఎట్లా?.... ఈ సారి ఏకాంబరంగారి మీద చెప్పలేనంత కోపం వచ్చింది అప్పలకొండకి.. అదే కోపంలో హుటాహుటిని ఆయన దగ్గరకు వెళ్ళి ఇన్‌లాండు కవరు ఆయన చేతిలో పెట్టి మళ్ళీ ఉత్తరం రాయమన్నాడు... ఈ సారి ఆ వుత్తరాన్ని మరింత వివరంగా రాయించాడు అప్పలకొండ..... ఒకటి రెండుసార్లు వాంతులయ్యాయనీ, గుండెల్లో నెప్పికూడా వచ్చిందనీ రాయించాడు.

మళ్ళీ ఆదివారం వచ్చేసింది...

ఈ సారి డాక్టర్ విఘ్నేశ్వరరావ్‌గారు సమాధానాలు ఇచ్చారు. అప్పలకొండ పంపిన ప్రశ్నకు కూడా ఆయన జవాబిచ్చారు.....

"అప్పలకొండగారు తమకు కడుపులో నెప్పి వస్తోందనీ రెండు మూడుసార్లు వాంతులయ్యాయనీ గుండెల్లో నెప్పి కూడా వచ్చిందనీ రాశారు... .ఏం చెయ్యమంటారని అడుగుతున్నారు. నన్నడిగితే ఇది చాలా మంచిప్రశ్న... అయితే కడుపునెప్పికీ గుండెనెప్పికీ ఎలాంటి సంబంధమూ లేదు... అలాగే గుండెనెప్పికీ వాంతులవటానికీ సంబంధంలేదు... ఇకపోతే కడుపునెప్పి రావటానికి అనేక కారణాలు వుంటాయి... గుండెల్లో నెప్పి కూడా ఎన్నో కారణాలవల్ల వస్తూంటుంది..... నన్నడిగితే ఈ గుండెనెప్పి ఎంతో ప్రమాదకరమైనదంటాను... ..కడుపునెప్పి ప్రమాదకరమైనది కాదా? అంటే అదీ ప్రమాదకరమైనదే.... అప్పలకొండగారికి రెండు నెప్పులూ వున్నాయి కనుక కొంచెం ప్రమాదకరమైన పరిస్థితిలో వున్నారని చెప్పాలి. కాబట్టి ఏ నెప్పి ఎందుకు వచ్చిందో వెంటనే వారు పరీక్ష చేయించుకుని మందులువాడాలి..."

ఈ సారి సమాధానం విన్న అప్పలకొండకు కోపంరాలేదు........ విసుగొచ్చింది.... రేడియో డాక్టరుగారు, తన కడుపునెప్పికి ఏదైనామందు చెబుతారేమో- ప్రత్యేకించి, ఓ రోజు కూలిపని మానుకొని డాక్టరుగారి కోసం టౌను కెళ్లటం తప్పుతుందనీ ఆ మందేదో ఎవరిచేతనైనా తెప్పించుకుని వాడవచ్చుననీ ఆశపడ్డాడు...ఆ ఆశ కాస్తా నిరాశయింది.

"రేడియోలో చెప్పిన ముగ్గురు డాక్టర్లూ కూడా నిన్ను దగ్గర్లోవున్న డాక్టరు చేత పరీక్ష చేయించు కొమ్మని సలహా ఇచ్చారు కాబట్టి, టౌనుకెళ్ళి, డాక్టరుగారికి చూపించుకుంటేనే మంచిది"-ఎలిమెంటరీ స్కూలు ఏకోపాధ్యాయుడు ఏకాంబరంగారు కూడా సలహా ఇచ్చారు.

ఇక తప్పదనుకున్నాడు అప్పలకొండ....

ఆ మర్నాడే బయలుదేరి టౌనుకెళ్ళాడు.... ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్ష చేయించుకున్నాడు.

"ఎన్నాళ్ళ నుంచీ వస్తోంది నెప్పి?" అడిగాడు డాక్టరు...

"ఇరవై రోజులనుంచీ వస్తోంది బాబూ "

"మరి ఇన్నాళ్ళూ ఏం చేశావయ్యా" పరీక్షచేస్తూ అడిగాడు ఆయన మళ్ళీ.

ఏం చేశాడో వివరంగా చెప్పాడు అప్పలకొండ... రేడియోలో వచ్చే డాక్టరు గారి సమాధానాలు కార్యక్రమానికి వుత్తరాలు రాసిన వైనం, దానికి ఆ డాక్టర్లు ఇచ్చిన జవాబులూ అన్నీ విపులంగా చెప్పాడు....

అంతావిన్న తరువాత డాక్టరుగారు ప్రిస్క్రిప్షన్ రాసి అప్పలకొండ చేతిలోపెట్టి అన్నారు-

"పదిహేను రోజులు ముందుగా వచ్చివుంటే బాగుండేది. ఇప్పుడు వ్యాధి బాగా ముదిరి పోయింది. అయినా నేను చేయగలిగింది చేస్తాను... ఆ పైన భగవంతుడే నిన్ను కాపాడాలి" అని.

డాక్టరుగారు చెప్పిన విషయం విన్న అప్పలకొండకి పిచ్చెత్తినట్టయింది... ఇంకెప్పుడూ రేడియోలో చెప్పిన విషయాలు వినకూడదనీ విన్నా నమ్మకూడదనీ నిశ్చయించుకుని మెడికల్ షాపులో మందులు కొనుక్కుని మళ్ళీ వూరు చేరుకున్నాడు అప్పలకొండ...

పాపం అప్పలకొండ జబ్బు తగ్గుతుందో లేదో?? ★

(ఆంధ్రభూమి 12-10-78)